"పాసింజర్ టికెట్ కొని, ఎక్స్‌ప్రెస్ ఎక్కావు..ఫైను కట్టాలి" దబాయించాడు.

అప్పటివరకు ఉన్న ఉత్సాహమంతా చేత్తో తీసేసినట్లు మాయమయింది. కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు వసంత్ ముఖంలో.

"తెలియక ఎక్కాను సార్!" బిక్కముఖం వేసుకుని అన్నాడు.

"అందుకే, ఫైను కట్టాలి! జేబులో ఎంత ఉందో తియ్యి" బెదిరింపుగా అన్నాడు.

జేబులో ఉన్న డబ్బంతా తీసి అతని చేతిలో పెట్టాడు అమాయకంగా!

"ఇంటికెళ్ళడానికి చార్జీలకు డబ్బు లేదండి!" బెరుకుగా చెప్పాడు.

ఏమనుకున్నాడో, ఏమో కొంత మొత్తం తిరిగిచ్చాడు టికెట్ కలెక్టర్.

పెప్సీకోలా! నల్ల కళ్ళద్దాలు. రంగురంగుల పెన్నులన్నీ ఎదురుగా నిలిచి గేలి చేస్తున్నట్లుగా అన్పించి బాధగా కళ్ళు మూసుకున్నాడు.

కనుకొనలలో నిలిచిన నీటి బిందువులను తుడుచుకుంటూ భారంగా బయటకు అడుగులేశాడు.

**-రమణ కాకర్ల (గుడిపాటిపల్లి)**

★★★

# హాబీ

అప్పటికి పదోసారి లేచి బాత్రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు రంగారావు. ఎదురుగా టేబుల్ మీద తన మొట్టమొదటి కవిత అచ్చయిన పత్రిక. దాని క్రింద తన అడ్రస్ సెల్‌ఫోన్‌తో సహా ప్రింటయింది. కచ్చితంగా ఆ కవిత చదివి ఆంధ్రదేశంలోని వేలాది సాహితీ పాఠకుల్లో ఒక్కరైనా తనకు ఫోన్ చెయ్యకపోతారా అనే ఆలోచన వచ్చాక మొదలైంది రంగారావుకి అసలు టెన్షన్.

నుదుటిమీద నరాలు ఉబ్బాయి. కళ్ళల్లో ఎర్రజీరలు తేలాయి. పదే పదే గోక్కోవడంతో టపాసు దెబ్బతిన్న కాకిలా తయారై జుట్టు రేగిపోయింది. మళ్ళీ లేచి బాత్రూమ్‌కు వెళ్ళబోయాడు.

అంతలో అతని నిరీక్షణ ఫలిస్తున్నట్టు ఫోన్ మురళీరవంలా పలికింది.

శ్రీకృష్ణుడిలా దాన్ని అందుకుని "హలో" అన్నాడు. ఎంత బాగా అందామన్నా కీచుకంఠం ఆ గదిలో ప్రతిధ్వనించింది.

"హలో సార్! రంగారావుగారేనా మాట్లాడుతుంటా?"

"అవునండీ..యింతకీ మీరు.."

"నా పేరు పాపయ్య. హైదరాబాదు నుంచి మాట్లాడుతున్నానండీ"

"అలాగే! యింతకీ ఏమిటి విషయం?" బాధతో మెలికలు తిరుగుతూ అన్నాడు రంగారావు.

"నా పలకరింపు మిమ్మల్ని బాగా షేక్ చేసినట్టుందే!"

"అది సరే! ఇంతకీ ఫోను ఎందుకు చేశారండీ?" బాధని బలవంతాన ఉగ్గపెట్టుకుంటూ అన్నాడు రంగారావు.

"సార్! మీ కవిత 'మృతకళేబరం ఆత్మఘోష' చదివానండీ. చాలా చాలా బాగుంది. ఇటీజ్ సో నైస్..కంగ్రాట్స్"

"నిజంగా!" ఒక్క అరుపు అరిచాడు రంగారావు. ఆ ఆనందంలో లుంగీ తడిసి పోయింది కూడా గమనించే స్థితిలో లేడు.

"నిజంగా నిజం సార్! మీలాంటి కవిపుంగవుల పరిచయం యిలా ఫోనులో కావడం నా అదృష్టం"

"థాంక్సండీ" అన్నాడు రిలాక్స్‌డ్‌గా.

"మీ గురించి తెలుసుకోవచ్చా?"

"నేను మొదట్లో చిన్నా చితకా గేయాలు రాసేవాడినండీ. రాను రాను వచన కవిత్వంపై పట్టు పెంచుకున్నాను. అడపాదడపా ఏదో ఒక కవిత సంకలనంలో నా కవితలు ప్రచురితమవుతూనే ఉంటాయి. నా కవిత చదివి ఫోన్ చేసిన ఫస్ట్ పాఠకుడు మీరే? మీ గురించి చెప్పండి" అన్నాడు రంగారావు తడి లుంగీ అసహనంగా చూసుకుంటూ.

"నేను ఒక కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఈమధ్యనే పదవీ విరమణ చేశానండీ. నా క్రింద పనిచేసిన వెధవల్లో ఒక్కడికీ ఈ సాహితీ అభిరుచి లేదంటే నమ్మండీ. కవిత్వం చదివి ఆనందించడం నా 'హాబీ'. మీ కవిత చదివాక ఫోన్ చేయకుండా ఉండలేకపోయాను. ఇలా ఎప్పుడైనా ఫోన్ చేస్తే మీకు ఇబ్బంది లేదు కదా?" అడిగాడు పాపయ్య.

"నో నాటెటాల్! థాంక్స్! చిన్న అర్జంటు పని ఉంది. పని చూసుకుని నేను ఫోన్ చేస్తాను" అన్నాడు రంగారావు.

"పది నిముషాల తర్వాత నేనే చేస్తాలెండి!" ఫోన్ పెట్టేశాడు పాపయ్య.

"అమ్మయ్యా" అనుకుంటూ తడి లుంగీతో బాత్రూమ్‌లోకి పరిగెత్తాడు రంగారావు.

మరునాడు- మళ్ళీ పాపయ్య ఫోన్.

"సార్! ఎలా ఉన్నారు? ఏమిటి విశేషాలు?"

"బాగానే ఉన్నాను. నిన్నటికీ ఈవేళ్టికీ విశేషాలు ఏముంటాయి?"

"ఈవేళ ఎన్ని కవితలు రాశారు?"

"ఇంకా ఏం రాయలేదండీ!"

"అదేంటండీ కత్తిలాంటి మీరు కనీసం పది కవితలైనా రాసేస్తారనుకున్నానే! మీ కవితలు ఏవైనా సంకలనంగా వేశారా?"

"అంత శక్తి నాకు లేదు సార్!"

"అరే మీరంత దీనస్థితిలో ఉన్నారా! రేపే మీకు అర్ధనూట పదహార్లు డి.డి. తీసి పంపిస్తాను సరేనా?"

అది వెయ్యి నూటపదహార్లు అని వినపడి "ఓకే సార్! పంపండీ! మీ సహాయానికి థాంక్స్!" అన్నాడు రంగారావు.

"మళ్ళీ రేపు చేస్తాను సార్" ఫోన్‌పెట్టేశాడు పాపయ్య.

★ ★ ★

మరునాడు తన సమకాలీకుడు త్రినాథ్ యింటికి వెళ్ళాడు రంగారావు. నిజానికి ఆ టైమ్‌కి పాపయ్య ఫోన్ చేస్తానన్నాడు. అది తప్పించుకోవడానికే త్రినాథ్ దగ్గరకు వచ్చాడు రంగారావు.

త్రినాద్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

రంగారావు త్రినాథ్ ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు.

"అలాంటి కవిత నేనొక్కడినే రాయగలను అని మీరు ఎంతో అభిమానంతో అంటున్నారుగానీ, నేనంత బాగా రాస్తానా?" అంటున్నాడు త్రినాథ్.

"మీలాంటి వారివల్లే ఈ సమాజంలో కుళ్ళు తుడిచిపెట్టుకుపోతుంది సార్! మీ పుస్తకాలు ఏవైనా ఉంటే పంపరూ? ఎంత రేటైనా పర్వాలేదు"

"ప్రస్తుతం ఏ పుస్తకమూ ప్రచురించలేదు సార్! వేశాక తప్పక పంపిస్తాను"

"నేనెవరికీ ఫోన్ చేయను సార్. మీ కవిత చదివాక ఫోన్ చేయకుండా ఉండలేకపోయాను. థాంక్స్ సార్. మళ్ళీ రేపుఫోన్ చేస్తాను" అనడంతో ఫోన్ పెట్టేసి రంగారావు కేసి తిరిగాడు త్రినాథ్.

"ఎవరయ్యా అంత ప్రేమగా మాట్లాడుతున్నాడు?" అడిగాడు రంగారావు.

"ఎవరో రిటైర్డ్ ప్రిన్సిపాలట. పేరు పాపయ్యట. మెంటల్ హాస్పటల్‌లో నైట్‌వాచ్‌మెన్‌గా చేరి వారం రోజులైందట. నేను వ్రాసిన కవిత చాలా చాలా బావుందట. ఎవరికీ ఫోన్ చేయడట. నాకు మాత్రమే ఫోన్ చేశాడట. ఈరోజుల్లో యిలాఫోన్ చేసి అభినందించే వాళ్ళు ఎందరుంటారు చెప్పు!" మురిసిపోతూ చెప్పుకుపోతున్నాడు త్రినాథ్.

"ఆ!" అని క్రిందపడిపోయిన రంగారావుని ఎప్పుడు గమనిస్తాడు! రంగారావు ఎప్పుడు లేస్తాడు. ఆ భగవంతుడికే తెలియాలి!

**-గాదిరాజు రంగరాజు (చెరుకువాడ)**

